సోలార్ విద్యుత్ దీపాలు పంపిణీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని 23 పంచాయితీలలో ఎంపీ నిధులతో సోలార్ విద్యుత్ స్ట్రీట్ లైట్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించారు., ఎంపీ తనుజరాణి, ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం, ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, మండల ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో ధర్మారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ,మండలంలోని అన్ని పంచాయతీలలో సోలార్ విద్యుత్ దీపాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సోలార్ ప్లేట్లు చోరీలకు పాల్పడకుండా గ్రామస్తులు పర్యవేక్షణ చేస్తూ సంరక్షించుకోవాలన్నారు. మండలా కేంద్రంలోని అంబేద్కర్ పార్క్, స్థానిక సిహెచ్ లలో ప్రత్యేకంగా సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న ఎంపీ

పిఎం జన్‌మన్ గృహాల బిల్లులు చెల్లించాలి

-ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు

అరకులోయలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పీఎం జన్ మన్ హౌసింగ్ పథకంలో పెంచిన రూ.1 లక్ష నిధులను వెంటనే విడుదల చేయాలని, పివిటిజి కుటుంబాలకు పీఎం జన్ మన్ పథకం కింద 11 రకాల అభివృద్ధి కార్యక్రమాలను తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు అరకులోయ తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించారు. అనంతరం తహశీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్, ఏఈలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి బుజ్జిబాబు, రామారావు మాట్లాడుతూ, మన్యం పార్వతీపురం జిల్లాలో పెంచిన రూ లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతున్నాయని, అల్లూరు జిల్లాలో ఎందుకు జమ కాలేదని అధికారులను ప్రశ్నించారు. పీఎం జన్మన్ కింద ఇస్తున్న రెండు లక్షల 39వేలు ఎటు చాలావని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా 10 లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. బిల్లులు ఆగిపోవడంతో ఇళ్ల నిర్మాణం పనులు మధ్యలో ఆగిపోయాయని తెలిపారు.

స్పందించిన ఎంపీడీవో, తహసిల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నేతలు కె బుజ్జిబాబు, కె జగన్నాథం ,రాజు, సత్యారావు, పి రామన్న, జి డొంబు, పి ప్రసాద్, పి సాయిచరణ్, మహిళలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

జికె వీధి: మండలంలోని పలు గ్రామాల నుంచి పిఎం జన్‌మన్ గృహాల లబ్ధిదారులు ఎంపిడిఒ రమణబాబును సోమవారం కలసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎం జన్‌మన్ గృహాలకు బిల్లులు తక్షణమే చెల్లించాలన్నారు.ఆయా గ్రామాలకు కల్పించాల్సిన సిసి రోడ్లు, అంగన్‌వాడి భవనాలు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు కొర్రా బాలయ్య, గాలికొండ ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు, గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం.చంటిబాబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జికె.వీధిలో..

ముంచింగిపుట్టు : పీఎం జన్మన్ బకాయి బిల్లులు చెల్లించాలని స్థానిక జడ్పీ గెస్ట్ హౌస్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి కుర్ర నర్సయ్య ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, లక్ష్మీపురం గ్రామపంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్, సిపిఎం మండల వైస్ ఎంపీపీ1 సత్యనారాయణ, మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను హాజరయ్యారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, మండలంలోనీ 23 పంచాయితీలలోనీ లబ్ధిదారులకు బకాయి బిల్లులు చెల్లించలేదన్నారు. గృహ లబ్ధిదారులకు సుమారు 4800 మందికి జియో టాగింగ్ చేసి కేవలం 150 మందికి మాత్రమే ఎలిజిబుల్ లిస్టులో చూపించడం దుర్మార్గమన్నారు. వైస్ ఎంపీపీ 1 సత్యనారాయణ మాట్లాడుతూ, పెంచిన లక్ష రూపాయలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల గిరిజన సంఘం అధక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గృహ నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. తహసిల్దార్ భాస్కర్ అప్పారావు, హౌసింగ్ ఏఈ కృష్ణారావులు స్పందిస్తూ హౌసింగ్ ఉన్నతా అధికారులకు, జిల్లా కలెక్టర్కు నివేదికలు పంపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు గల్లెల నారాయణ, పాంగి భీమరాజు, సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు, ఐద్వా మండల అధ్యక్షురాలు ఈశ్వరి, గిరిజన సంఘం, సిపిఎం, నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేటలో...

జి.మాడుగుల: పీఎం జన్మన్ గృహ నిర్మాణ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ మాట్లాడుతూ, ఆగిపోయిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు ముువ్వల నాగేశ్వరరావు, సిదేరి చిన్నారావు, ఉమెన్ రైట్ నాయకులు వంతల మల్లేశ్వరరావు, సీతారాం, సుబ్బారావు, ప్రసాద్, సన్యాసిరావు, గణేష్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న గిరిజనులు

హుకుంపేట: పీఎం జన్మన్ గృహాల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ, ఆందోళన చేపట్టారు.గిరిజన సంఘం కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు తాపుల కృష్ణారావు, కార్యదర్శి పాంగి సోమన్న మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం పెంచిన లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు తాపుల కృష్ణారావు, కార్యదర్శి పాంగి సోమన్న మాట్లాడుతూ, చిన్న గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వి.లక్ష్మణ్‌రావు, గిరిజన నాయకులు కృష్ణారావు, సోమన్న, పాలకొండ పడాల్, పీఎం జన్మన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమస్యలపై చర్చలు విఫలం

ప్రజాశక్తి-చింతపల్లి : కాఫీ కార్మికుల సమస్యలపై సోమవారం చర్చలు విఫలమయ్యాయి. దీంతో సమ్మె కొనసాగుతుందని యూనియన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. కాఫీ కార్మికుల సమస్యలపై పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గత నెల 10వ తేదీన సంస్థ యాజమాన్యానికి సమర్పించారు. దీనిపై యాజమాన్యం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ నెలలో కార్మికులు సమ్మె ప్రారంభించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఈ నెల 10న సోమవారం యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. చర్చల్లో యూనియన్ ప్రతినిధులు పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మూడు నెలల్లోపు కిందస్థాయి సిబ్బందిని నియమిస్తామని గత సంవత్సరం ఆర్‌ఎం సమక్షంలో హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు నియామకాలు జరగకపోవడం విచారకరమన్నారు. ఈ అంశం ఎమ్‌డి దృష్టిలో ఉందని చెప్పడం తప్ప యాజమాన్యం ఏ చర్యా తీసుకోలేదని విమర్శించారు. కింద స్థాయి ఉద్యోగులను నియమించకపోతే సంస్థ పరిరక్షణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. విడిఎ కరువు భత్యం పాయింట్లకు అనుగుణంగా రోజుకూలి రేట్లు, కేజీ పండ్ల రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై యాజమాన్యం జీవో వచ్చిన తర్వాతే చర్యలు తీసుకుంటామనే తీరుతో వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పర్మినెంట్ క్వార్టర్ల మరమ్మతుల విషయంలో కేవలం ప్రతిపాదనలే ఉన్నాయిగాని, ఎక్కడా అమలు జరగలేదని యూనియన్ నేతలు ఆక్షేపించారు. సంస్థ రక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారమే తమ సమ్మె లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఏపీఎఫ్‌డీసీ డివిజనల్ మేనేజర్ (పాడేరు) కృష్ణబాబు, చింతపల్లి డివిజనల్ మేనేజర్ రత్న దీపిక, త్రిమూర్తుల రెడ్డి (ఆర్వీ నగర్), సత్యం (నర్సీపట్నం), పూర్వడియం మహేష్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, కాఫీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్. సుందరరావు, జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ, కాఫీ కార్మిక సంఘం నాయకులు రాజు, మోరి వెంకటగిరి, హెల్పర్ల సంఘం ప్రతినిధులు రాజారావు, ఆర్ముగం, కనకవల్లి, కాంతమ్మ, వెంకటేష్, సింహాచలం, బాలకృష్ణ, సుందర్ కుమార్ పాల్గొన్నారు.

హాజరైన యూనియన్ ప్రతినిధులు

ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, గ్రామస్తులు

కొందు జాతి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో ఐటిడిఎ వద్ద నిరసన

ప్రజాశక్తి-రంపచోడవరం : కొందుజాతి గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఐ (ఎంఎల్), ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డతీగల మండలం దొరమామిడి పంచాయతీ కినపర్తి గ్రామ శివారులోని అడవిలో, రాజవొమ్మంగి మండలం జడ్డింగ్ పంచాయతీ చిన్నయ్యపాలెం పరిసరాల్లో సుమారు 15 సంవత్సరాలుగా నివసిస్తున్న కొందు జాతి గిరిజనులు ఇప్పటికీ ప్రభుత్వ గుర్తింపు పొందక చీకటిలోనే మగ్గుతున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రెండు గ్రామాల్లో 21 కుటుంబాలు, దాదాపు 100 మంది జనాభా ఉన్న ఈ గిరిజనులు ఆధార్‌కార్డులు ఉన్నప్పటికీ రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ బియ్యం పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. పిటిజి. మైగ్రేషన్‌లో ఉన్నప్పటికీ ఎస్టీ కుల సర్టిఫికెట్ ఇవ్వకుండా అడ్డతీగల, రాజవొమ్మంగి తహశీల్దార్లు నిరాకరిస్తున్నారని వారు ఆరోపించారు. అడవిలో కరెంట్ లేక చీకటిలో పాముల భయంతో జీవిస్తున్న గిరిజనుల ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని, రేషన్ కార్డులు జారీ చేయాలని, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం డివిజన్ నాయకుడు సోమల కుశల, కినపర్తి గ్రామ గిరిజనులు డిప్పల చిన్నబ్బాయి, మర్రి రాంబాబు పాల్గొన్నారు.

ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించి వ్యక్తిగతానికి సంబంధించిన అర్జీలను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు వినతులకు పరిష్కార మార్గాలు అన్వేషించి సమస్యలు పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. పిఒ మాట్లాడుతూ ఈ వారం సుమారు 90 అర్జీలు రావడం జరిగిందని ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

హైడ్రోపై బాక్సైట్ తరహాలో పోరాటం

-రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజనుల మనుగడకు తీవ్రంగా నష్టాన్ని వాటిల్లించే హైడ్రో పవర్ ప్రాజెక్టులపై బాక్సైట్ తరహాలో ఉద్యమం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణి లు పిలుపునిచ్చారు.అధికార పార్టీకి చెందిన గిరిజన నేతలైన రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి. శ్రావణ్ కుమార్, ఆర్టీసీ విజయనగరం రీజినల్ జోనల్ సియారి. దొన్నుదొరలు గిరిజనుల పక్షాన పోరాటం చేయాలని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయం వద్ద హైడ్రో పవర్ పోరాట మండల కన్వీనర్ సివేరి .కొండలరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం, విద్యార్థి సంఘం, సిపిఎం, వైసీపీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జెడ్పిటిసి గంగరాజు, ఎంపీపీ. నీలవేణిలు మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్టులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాని నవయుగ కంపెనీలతో కుదిర్చుకున్న జీవోలను తక్షణమే ఉపసవరించుకొని గిరిజన ప్రాంతం అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. బాక్సైట్ తరహాలో పోరాటం ఉధృతం చేస్తామని, గిరిజన భూములు, అడవుల జోలికి వస్తే సాంప్రదాయ ఆయుధాలతో తరిమి కొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పి.బాలదేవ్, మండల సర్పంచుల పోరం అధ్యక్షులు పాగి అప్పారావు, వైసిపి పార్టీ మండల అధ్యక్షులు కొర్రా సూర్యనారాయణ, సర్పంచులు కిల్లో. మసియా, ఎస్.రూతు, ఎస్.సన్యాసిరావు, హైడ్రో పోరాట కమిటీ కన్వీనర్ వి.బుద్రయ్య, చిట్టిబాబు, కొండలరావు, అప్పలస్వామి, మండల మహిళా సంఘం నాయకులు. డి.దేవుడమ్మ, మండల సిపిఎం నాయకులు ఎస్ .నాగులు, జె. భీమన దొర, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హైడ్రోపై వ్యతిరేకంగా మండల సమావేశంలో తీర్మానించాలి

హుకుంపేట: హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ముందు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు ఎంపీపీ కూడ రాజు బాబుకు మెమోరాండం అందజేశారు. జీఓ నంబర్లు 2, 13, 51లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమిటీ కో-కన్వీనర్లు టి.కృష్ణారావు, బి.కృష్ణంరాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల అభీష్టానికి విరుద్ధంగా హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాయని విమర్శించారు. మండల సర్వసభ్య సమావేశంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు, కార్యదర్శులు టి.కృష్ణారావు, పి.సోమన్న, నాయకులు వి.లక్ష్మణరావు, టి.అప్పల కొండ, పడల్ వంశీ, పోరాట కమిటీ నాయకులు ఎస్.పరశురాం, ఎం.రామకృష్ణ, కె.బాలరాజు, టి.కొండలరావు, పి.అరుణ్‌కుమార్, ఎం.శోభన్, మజ్జి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ సభ్యులు, నాయకులు

మాతాశిశుమరణాలకు..

కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను

ప్రజాశక్తి-రంపచోడవరం: కోటం బాపన మృతికి కారకులైన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులపై క్రిమినల్ కేసులు కేసు నమోదు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఐటిడిఎను ముట్టడించారు.అనంతరం పిఒ ఆదివాసీ సంక్షేమ పరిషత్, కోటం బాపనమ్మ కుటుంబ సభ్యుల తోటి మాట్లాడారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు ఇచ్చిన వినతి పత్రాన్ని, కుటుంబ సభ్యులు వ్యక్తిగతంగా ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను స్వీకరించి మూడు రోజుల్లో నివేదిక తెప్పించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినటు కుంజ శ్రీను తెలియజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రంపచోడవరం డివిజన్‌లో ఆదివాసీల ప్రాణాలు అంటే వైద్యులు, అధికారులు, ఎమ్మెల్యేకు లెక్కలేకుండా పోతోందని. ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంతో వరుస మరణాలు సంభవిస్తున్న కనీసం చలించక పోవడం దురదష్టకరమనిఆవేదన వ్యక్తం చేశారు. పిఒ చర్యలు తీసుకోకపోతే మరో రెండు వారాల్లో భారీ ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. మాత శిశు మరణాలు వరుసగా సంభవిస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే కనీసం ఆసుపత్రిని సందర్శించి ఎందుకు వరుస మరణాలు సంభవిస్తున్నాయో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించకపోవడం దురదష్టకరమని ఆయన అన్నారు. కోటం బాపునమ్మ ఆమె శిశువు మృతికి శతశాతం రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని వారిపై క్రిమినల్‌కేసులు ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ఆయన హెచ్చరించారు. ఆ రోజు విధుల్లో ఉన్న సిబ్బంది డాక్టర్లపై కేసులు నమోదు చేయాలని, అన్ని విభాగాలకు పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పిఒ అందజేసినట్లు ఆయన తెలియజేశారు. ఇకపై మాత శిశు మరణాలు శాతం జీరోకి తీసుకురావాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోరాటం చేస్తుందని, ఈ ఉద్యమంలో ప్రజలంతా భాగ్యస్వామ్యం కావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోటం బాపనమ్మ కుటుంబ సభ్యులు, కోటం రాజన్న దొర, పోడియం అరుణకుమారి, కోసు దేవి శ్రీదేవి, లలిత కుమారి ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్‌కుమార్‌దొర, ఉపాధ్యక్షులు బోరగ ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

లోతా రామారావును పరామర్శిస్తున్న గిరిజన సంఘ నేతలు

లోతా రామారావుకు గిరిజన సంఘం నేతల పరామర్శ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గిరిజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు తీవ్ర జ్వరంతో బాధపడుతూ జడ్డంగి పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆదివాసీ, గిరిజన సంఘం నాయకులు కొండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, వజ్రపు అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, విఒఎ నాయకురాలు కె రమణమ్మ, తదితరులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గూర్చి అడిగి తెలుసుకు న్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభ విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: నవంబర్ 16,17వ తేదీల్లో రంపచోడవరంలో జరిగే సిఐటియు జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ తాటితూరి శ్రీనివాస్ సోమవారం పిలుపునిచ్చారు. సోమవారం జడ్డంగిలో ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 16న ఆదివారం జరిగే బహిరంగకు వందలాదిగా కార్మికుల తరలి రావాలని అలాగే 17న ప్రతినిధుల సమావేశానికి ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.సూరిబాబు ఆశ వర్కర్ యూనియన్ నాయకురాలు చంద్రకళ, భవాని,సీత యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శ్రీనివాసు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెజిస్ట్రేట్ మురళిగంగాధరరావు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- రంపచోడవరం : మండల న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రంపచోడవరం యం.యం.మురళి గంగాధరరావు ఆధ్వర్యంలో సోమవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. బాలికలకు బాల్యవివాహ చట్టలపై, బాల కార్మికచట్టాలు, పోక్సో, గుడ్ టచ్ బాడ్ టచ్, పైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకురాలు ఝాన్సీరాణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జడ్జి మురళి గంగాధరరావు హాస్టల్‌లో విద్యార్థుల ఇబ్బందులు తెలుసుకున్నారు. వారి యెక్క ఇబ్బందులను తెలుసుకున్నారు. పాఠశాల యాజమాన్యానికి వసతి సదుపాయాలు బాగా కల్పించాలని సూచించారు.



పిఒకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు

ఇళ్ల నిర్మాణంలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, బిల్లుల మార్పుల్లో అవకతవకలు జరిగాయని ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆరోపించింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సాదల విద్యాధర్‌రెడ్డి పిఒ దష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు, పలు చోట్ల నాణ్యతలేని నిర్మాణాలు, అసంపూర్తి ఇళు ,, బిల్లుల్లో అవకతవకలు గుర్తించామని తెలిపారు. ముఖ్యంగా దబ్బవలస గ్రామానికి చెందిన బొద్దిరెడ్డి ఇల్లు పూర్తికాకపోయినా రూ.70వేల బిల్లులు మార్చడం జరిగినట్లు పేర్కొన్నారు. చిలకవీధి గ్రామానికి చెందిన కుర్ల జోగిరెడ్డి, చెదల దినేష్‌రెడ్డి ఇళ్ల నిర్మాణంలో కూడా అవకతవకలు చోటుచేసుకున్నాయన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. దబ్బవలస చిలక వీధి గ్రామానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

అరకు చలి ఉత్సవాలపై సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: 2026 సంవత్సరానికి గాను అరకు చలి ఉత్సవాలను జనవరి 3, 4 తేదీలలో ఉండవచ్చని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. గత సంవత్సరం ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ, ఈ సంవత్సరం కూడా ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి జిల్లా అధికారులతో ఉత్సవాల కార్యాచరణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులకు కేటాయించిన కార్యకలాపాలను అప్పగించారు. మొదటి రోజు ఉత్సవాలు మారథాన్ రన్ తో ప్రారంభమవుతాయి. అనంతరం స్టాల్స్ ప్రారంభోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, జూనియర్, సీనియర్ చిత్రలేఖన పోటీలు జరుగుతాయని తెలిపారు. రెండవ రోజు సైక్లింగ్, లేజర్ షో, ఫైర్ షో, వివిధ గిరిజనుల సాంప్రదాయాలను ప్రతిబింబించే కార్నివాల్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయన్నారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. దేశ నలుమూలల నుంచి కళాకారులను ఆహ్వానించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి స్టాల్స్ ఏర్పాటు చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రెండు రోజులు పాటు పర్యాటకులకు, ప్రజలకు వీలుగా ఫుడ్ స్టాల్స్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ అరకు చలి ఉత్సవాలపై టీజర్, పోస్టర్లు రూపొందించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఏ పిఒ తిరుమణి శ్రీ పూజ, జిల్లా రెవెన్యూ అధికారి కె పద్మలత, జిల్లా పర్యాటకశాఖ అధికారి కె దాసు, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పరిమళ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిపి బ్రౌన్‌కు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: సిపి బ్రౌన్ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఎల్ లక్ష్మి ప్రసాద్ తో బ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పించారు. బ్రౌన్ ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారిగా పనిచేస్తూనే, తెలుగు భాష అభివృద్ధికి అపారమైన మక్కువ కనపరిచారన్నారు.1817లో ఈస్ట్ ఇండియా కంపెనీలో చేరిన బ్రౌన్, 1820లో కడపలో డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న సమయంలో తెలుగు నేర్చుకోవడంలో ఉన్న ఇబ్బందులను గుర్తించి. తెలుగు నేర్చుకోవడానికి సరళమైన, శాస్త్రీయమైన పద్ధతి లేకపోవడం చూసి చలించిపోయారన్నారు.ప్రాచీన తెలుగు కావ్యాలను వెలికితీసి, వాటిని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ప్రచురించారన్నారు. తెలుగు భాషాభివృద్ధికి చేసిన సేవలు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచి పోతాయన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని గుంటసీమ రోడ్డు హైస్కూల్ పక్కన ఉన్న టిక్కిలి వెల్ల వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆ వీధి గ్రామస్తులు కోరుతున్నారు. మెయిన్ రోడ్డు కిరువైపులా వీధి దీపాలు ఉండగా గుంటసీమ రోడ్డు వీధి దీపాలు ఏర్పాటు చేయక పోవడంతో రాత్రులలో చిమ్మ చీకటిగా ఉంటుందని స్థానికులు తెలిపారు. దీంతో రాత్రుల్లో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పీహెచ్సీకి వెళ్లే వ్యాధిగ్రస్తులు రాత్రుల్లో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పలుమార్లు సంబంధిత పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా వీధి దీపాలు ఏర్పాటు చేయలేదన్నారు.

సమస్యలపై సభ్యుల గళం

హుకుంపేట మండల సర్వసభ్య సమావేశం

సభ్యుల సమస్యలను వింటున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి, హుకుంపేట:మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమస్యలపై సభ్యులు గళం ఎత్తారు. సమావేశానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాజు బాబు అధ్యక్షత వహించగా, ఎంపీడీవో రమాదేవి నిర్వహించారు. ఈ సభలో ఎంపీటీసీలు మజ్జి హరి, మహేష్, వైస్ ఎంపీపీ సూదిపల్లి కొండలరావు, సర్పంచులు రంజిత్‌కుమార్, సాంబ, బాకూరు వెంకటరమణ రాజు తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. హైడ్రోపవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖపై వైస్ ఎంపీపీ సూదిపల్లి కొండలరావు మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలను గుర్తించి కాపాడాలని, అక్రమ కట్టడాలు నిలిపివేయాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వ భూములు ధారాధత్తం చేయడాన్ని ఖండించారు. అధికారులు తమ శాఖల నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా సూడిపల్లి కొండలరావు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు విజ్ఞప్తి చేస్తూ, హుకుంపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలుర పాఠశాలకు సొంత భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తగిన భవనం ఏర్పాటు చేయాలని కోరారు. తాడిగిరి సర్పంచ్ పెనుమల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ, పాఠశాలల్లో హెల్త్ వర్కర్లు, వాచ్‌మెన్‌ల నియామకంతో పాటు హాస్టల్‌లో సమస్యల పరిష్కరించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రెవెన్యూ శాఖ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె ప్రైవేట్ వ్యక్తులకు ఎల్పీసీలు ఇవ్వడాన్ని నిలిపివేయాలన్నారు.. అక్రమ కట్టడాలకు తావు లేకుండా రెవెన్యూ అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఆదేశించారు. పాఠశాల భవనాలకు స్థలాలు ఏర్పాటుచేయాలని సూచించారు. పథకాలు గిరిజనులకు ఉపాధి కల్పించే దిశగా అమలు కావాలని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖ పనితీరుపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తారు రోడ్ల నిర్మాణాలు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సన్యాసినాయుడు, పి ఆర్ జె ఈఈ సంజీవరావు, సీడీపీఓ గునుపూడి సువర్ణమ్మ, వ్యవసాయ అధికారి కె.సుధాకర్, ఎంఈఓ సోమేలి చెల్లయ్య, వైద్య, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాన్ని పూర్తి చేయాలి

పిత్త మరిగుడ గిరిజనుల ఆందోళన

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం. జిల్లా ఉపాధ్యక్షుడు. టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని కురిడీ పంచాయతీ పిత్తమరిగుడ గ్రామంలో పర్యటించి అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022 అక్టోబర్‌లో నాడు నేడు పథకం ద్వారా సుమారు రూ14 లక్షలతో అంగన్వాడీ భవనం నిర్మాణంకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లేక అంగన్వాడీకి వెళ్ళే చిన్నారులు ఇరుకు గదిలో ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై సంబంధిత జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని, అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనం పూర్తి చేయాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ఉప సర్పంచ్ వి త్రినాద్,పెసా ఉపాధ్యడు, ముకుంద్, గిరిజన సంఘం మండల నాయకులు రామచందర్, జీన బంద్, జయరామ్ ,జాంబవతి, నీలమ్మ పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి-చింతపల్లి : అంతర్ల గ్రామ పంచాయతీ పరిధి కొత్తవీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ పనులను ఎంపీపీ నిధులతో చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనూషాదేవి ప్రజల సహకారంతో వీధికి సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దూరియా పుష్పలత, ఎంపీటీసీలు దాసరి ధరలక్ష్మి, చి.జయలక్ష్మి, వైసిపి నాయకులు జల్లి సుధాకర్, బుసరి కృష్ణ, పి.పరమేష్, సాగిన గంగన్న పడాల్, పీసా ఉపాధ్యక్షులు గబులంగి నాగేశ్వరరావు, కార్యదర్శి కావడం శివసంతోష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభమైంది. "డేటా అనాలిటిక్స్" అన్న అంశంపై శిక్షణ ఇవ్వడానికి ఒంగోలు నుండి కె.శ్రీకృష్ణ తరగతులను నిర్వహిస్తున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినుముల శ్రీనివాస పాత్రుడు, పీఎం ఉష, కోఆర్డినేటర్ డాక్టర్ రమణ, సర్టిఫికెట్ కోర్స్ కన్వీనర్ వంతల ఈశ్వరరావు, కో-కన్వీనర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్

కళాశాల హాస్టల్ భవనం నిర్మించాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అనంతగిరి:పునాదులతో నిలిచిన జూనియర్ కళాశాల హాస్టల్ వసతి భవనం పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం కళశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవన్ .కార్తిక్.లు మాట్లాడుతూ, కళాశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు కనీస హాస్టల్ భవనాలు లేక అద్దె గదులలో ఉంటూ చదువు కొనసాగించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. మరికొంత మంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. కళాశాల చుట్టూ ప్రహరి గోడ, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లే గ్రౌండ్ లేక పోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారని, తక్షణమే కూటమి ప్రభుత్వం కళాశాలలో నెలకొన్న మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల వరుస మరణాలు సంభవిస్తున్నాయని, ప్రధానంగా ప్రతి వసతి గృహాలలో హెల్త్ అసిస్టెంట్లు లేక పోవడమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, సుబ్రమా. విద్యార్థులు పాల్గొన్నారు

ఎఎంవిఐ సాయిరమేష్ బాధ్యతల స్వీకరణ

సాయిరమేష్

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలో నూతన అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ (ఏఎంవీఐ)గా చెబోలు సాయి రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సాయి రమేష్, తాజాగా అల్లూరి సీతారామ రాజు జిల్లా రవాణా శాఖాధికారిగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియతో మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యం అన్నారు. వాహనాల భద్రతా ప్రమాణాలు, ఫిట్‌నెస్ తనిఖీలు, డ్రైవింగ్ లైసెన్స్ జారీ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై కృషి చేస్తానని తెలిపారు.

డ్రగ్స్ అనర్ధాలపై అవగాహన

ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న పోలీసులు,

ప్రజాశక్తి-కాశీపట్నం:అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డ్రగ్స్ అనర్ధాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈగల్ సిఐ రమేష్ మాట్లాడుతూ, యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడితే కలిగే నష్టాలను వివరించారు.ఎన్డిపిఎస్ సిఐ రవి కుమార్, అనంతగిరి ఏఎస్ఐ రాజాంనాయుడు మాట్లాడుతూ, గంజాయి దుష్పరిణామాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- గంగవరం: టిడిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గంగవరం మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జడేరు గ్రామంలో డ్వాక్రాగ్రూపు సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు, వడ్డీ లేని రుణాల గురించి గ్రూపు సంఘాల సభ్యులకు వివరించారు. రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, బూత్ ఇన్‌చార్జి చెక్క రాజారెడ్డి విఒ అధ్యక్షుడు పొత్తూరి అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపిడిఒ యాదగిరేశ్వరావు

అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఎటువంటి పంచాయతీ అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమ కట్టడాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తప్పవని రాజవొమ్మంగి ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపిడివో కార్యక్రమంలో మండలంలో పంచాయతీ కార్యదర్శ లు, విఆర్ఒలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వారాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పంచాయతీ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న నాన్ ట్రైబల్, ట్రైబల్‌కు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వాలని విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు ఆదేశించారు. గుర్తించిన బంగారు కుటుంబను దత్తత తీసుకున్న మార్గదర్శిలు 15 రోజులకు ఒకసారి ఐనా వారి బాగోగులు అడిగి తెలుసుకొని వారికి సహాయం చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, మంచినీటి పథకాలలో క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి పాడేరు, : జిల్లాలో తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరగకుండా రైతులకు అధిక ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, డిఆర్‌డిఏ, కాఫీ, డ్వామా, ఆగ్రో కార్పస్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాఫీ తోటలకు నష్టం కలిగిస్తున్న బెర్రీ బోరర్ వంటి తెగుళ్ల బెడదను దృష్టిలో ఉంచుకుని, రైతులను సిల్వర్ ఓక్ చెట్లకు బదులు ఇతర అధిక విలువైన పంటలు వేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేయించడం ద్వారా తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలతో వచ్చే నష్టాన్ని తగ్గించి, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. సంవత్సరం మొత్తం ఆదాయం వచ్చేలా అవకాడో, లిచీ, జాక్ ఫ్రూట్, స్వీట్ ఆరంజ్ వంటి పంటలపై దష్టి పెట్టాలని ఉద్యాన, కాఫీ, ఆగ్రో కార్పస్ శాఖలను ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక పంటలైన కాఫీ, నల్ల మిరియాల నాణ్యత తగ్గకుండా వాటిలో పోషకాలు పెంచే విధంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. రవాణా ఖర్చులు తక్కువగా ఉండే, మార్కెట్‌లో మంచిధర లభించే పంటలను మాత్రమే ప్రోత్సహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ, డి.ఆర్.డి.ఏ., డ్వామా శాఖల అధికారులు సమన్వయంతో రైతులకు ప్రత్యామ్నాయ పంటల గురించి అవగాహన కల్పించాలని, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా పంటల మార్పిడి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని నర్సరీలలో ప్రత్యామ్నాయ పంట మొక్కల పెంపకంపై దష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్. నంద్, డిఆర్‌డిఏ. పిడి. మురళి, డ్వామా ఇంచార్జ్ పి.డి. ఎల్. సీతయ్య, కాఫీ విస్తరణ అధికారి ఈ. రమేష్, ఆగ్రో కార్పస్ మేనేజర్ వి.రజియా పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి పవర్ కెనాల్ లీకేజీ అరికట్టే పనులు ఆదివారం ఉదయం నుంచి రాత్రి 1 వరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసినట్టు ఎపి జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు తెలిపారు. పవర్ కెనాల్ రీచ్ వన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో వ్యాప్ వాయిస్ నుంచి బురద నీరు వస్తున్నట్లు తమ సిబ్బంది కెనాల్ పెట్రోలింగ్‌లో భాగంగా సకాలంలో గుర్తించి సమాచారం ఇవ్వడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఈ మేరకు ఎలొసి అనుమతులు తీసుకొని కెనాల్ నుంచి నీటిని నిలిపివేశామన్నారు. అనంతరం లీకేజీ ఉన్న ప్రదేశాల్లో గ్రౌటింగ్ చేసి పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం పవర్ కెనాల్‌కు ఎటువంటి సమస్య లేదని ఎప్పటికప్పుడు తమ సిబ్బంది పర్యవేక్షణ చేస్తూ జాగ్రత్తలు పాటిస్తున్నారని పేర్కొన్నారు. పనులు పూర్తి కావడంతో సోమవారం ఉదయం పరిస్థితి పరిశీలించి ఎల్ సి అనుమతులు వెనక్కి పంపామన్నారు. సోమవారం ఉదయం అంచెలంచెలుగా నీటిని విడుదల చేసి పోల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుదుత్పత్తి చేయడానికి గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టామన్నారు. దిగువ సీలేరు డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో ఉదయం నుంచి సాంకేతిక లోపాలు తలెత్తడంతో స్లూయిస్ గేట్ నుంచి కెనాల్‌లోకి నీటిని విడుదల చేశామని తెలిపారు.

స్లూయిజ్ గేట్లు నుంచి పవర్ కెనాల్‌కు నీటి విడుదల

ప్రస్తుతం పవర్ కెనాల్ నుంచి 10.30 అడుగులు నీటిని పోల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చీఫ్

మంచు దుప్పట్లో.. ఏజెన్సీ

రెయిన్‌గేజ్ వద్ద కురుస్తున్న మంచు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ప్రాంతాల్లో గత రెండు రోజుల నుంచి చలి అధికమైంది. చింతపల్లి క్యాంప్ జిడిసి క్యాంప్ ప్రజలు చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. దీంతోపాటు చల్లటి చిరుగాలులు క్రమేపి చలి తీవ్రత అధికమవుతోంది. తెల్లవారు జామున మూడు గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు చలి తీవ్రత ఉంటోంది. తిరిగి సాయంత్రం 4.30 నుంచి మళ్లీ పెరుగుతోంది. సీలేరు నుంచి వయా దుప్పిలివాడ, దారకొండ చింతపల్లి మీదగా మైదాన ప్రాంతానికి వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు రూ.125 కోట్ల ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: రాష్ట్రంలో ఐటి (సమాచార సాంకేతికత) ఎలక్ట్రానిక్స్ రంగాల్లోని కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ రంగాల ప్రోత్సాహకాల్లో భాగంగా రూ.125 కోట్లకు పైగా విలువైన ప్రోత్సాహకాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. దీనిలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న (వివిధ సెట్‌లకు చెందిన) ప్రోత్సాహకాల్లో ఇది మొదటి విడతగా 50 శాతం మొత్తాన్ని విడుదల చేయడం విశేషం. పెండింగ్ మొత్తాన్ని కూడా తదుపరి విడతలో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ పరిశ్రమ (ఎపిడిటిఐ) నెట్ వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు హర్షం వ్యక్తం చేసారు. పరిశ్రమల సమస్యలను అర్థం చేసుకుని, వాటికి అండగా నిలబడినందుకు ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌కు ఐటీ, ఎలక్ట్రానిక్స్ వర్గాలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాయి. ముఖ్యంగా, ఈ ప్రోత్సాహకాల విడుదలలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి భాస్కర్ కాటంనేని పట్టుదల, కృషిని, అలాగే ఆయా శాఖల పనితీరును అభినందించారు.

ఎయు బ్యాక్‌లాగ్ నియామకాల అక్రమాలపై విచారణ జరపాలి

సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఎయు బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై యూనివర్సిటీ ఉపకులపతి స్పందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విశాఖపట్నం జిల్లా సమితి డిమాండు చేసింది. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిఎన్ క్షేత్రపాల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత విశ్వవిద్యాలయంలో అక్రమాలకు తావు ఉం డకూడదని పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకాల విషయంలో అంత గోప్యత ఎందుకని ఉన్నత అధికారులని ప్రశ్నించారు. నియామకాల విషయంలో ఉన్నతాధికారుల తీరు అనుమానం కలిగించే విధంగా ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ వివరాలు, పోస్టుల సంఖ్య, దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, మెరిట్ లిస్టును తక్షణమే బహిరంగ పరచాలని డిమాండు చేశారు. ఈ వ్యవహారంలో యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఉన్నత విద్యామండలి దృష్టి సారించి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాక్ అక్రమాలు నిజమని తెలితే అధికారులపై కఠినచర్యలు తీసుకోవాల న్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉత్తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో 2024-2025 విద్యా సంవత్సరాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరి రైల్వే ఉద్యోగుల పిల్లలకు సోమవారం ఉపకార వేతనాలు (స్కాలర్‌షిప్‌లు) అందజేసి సన్మానించారు. పోర్ట్ స్టేడియం, సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ (వాల్తేరు) అధ్యక్షురాలు జ్యోత్స్న బోహ్రా అధ్యక్షత వహించారు. ఈ వేడుకలో మొత్తం 340 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఎస్ఎస్‌సి ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు, ఐఐటి, మెడికల్, ఇంజనీరింగ్ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఉన్నారు. ఈ వేడుకకు ఉపాధ్యక్షురాలు గాయత్రి సంతారామ్, కార్యదర్శి అంకితాశర్మ కార్యనిర్వాహక సభ్యులు బ్రాంచ్ అధికారులు, ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డయాబెటిస్ నియంత్రణకు బాదం ఎంతో మేలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ప్రతి సంవత్సరం నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, రక్తంలో చక్కెర స్థాయిల నిర్వహణలో కాలిఫోర్నియా బాదంపప్పుల ప్రాముఖ్యతపై ఆరోగ్య నిపుణులు షీలా కృష్ణస్వామి (న్యూట్రిషన్ కన్సల్టెంట్) ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నం బీచ్ రోడ్‌లో వాకర్స్ కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం 'ప్రపంచ మధుమేహ రాజధాని' గా అవతరించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ అధ్యయనం ప్రకారం, దేశంలో ప్రస్తుతం 101 మిలియన్ల మందికి మధుమేహం ఉండగా, మరో 136 మిలియన్ల మంది ప్రీ-డయాబెటిక్ దశలో ఉన్నారన్నారు. ఇది అత్యంత ఆందోళన కలిగించే విషయమన్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను ఆరోగ్యకరంగా ఉంచడానికి, ప్రజలు తమ రోజును ప్రోటీన్, అసంతృప్త కొవ్వులు డైటరీ ఫైబర్‌తో సమద్ధిగా ఉండే బాదంతో ప్రారంభించాలని ఆమె తెలిపారు. డాక్టర్ అనూప్ మిశ్రా నేతృత్వంలో జరిగిన ఒక అధ్యయనం, ప్రీడయాబెటిస్, ఊబకాయంతో బాధపడుతున్న ఆసియా భారతీయులు భోజనానికి ముందు బాదం వినియోగించడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణ గణనీయంగా మెరుగుపడిందని నిరూపించిందని తెలిపారు. కార్యక్రమంలో రితికా సమద్దర్ (మాక్స్ హెల్త్‌కేర్)మధుమితకృష్ణన్ (ఆయుర్వేద నిపుణురాలు) పాల్గొన్నారు.

శివ ప్రకాష్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: నగరంలో పురాతన నాణెములు, స్టాంపులు సేకరణలో గత కొన్నాళ్లుగా విశేషంగా కృషి చేస్తున్న 15వ వార్డు జె.ఆర్.నగర్‌కు చెందిన జి.ఎస్ శివప్రకాష్‌కు జాతీయస్థాయి అవార్డు లభించింది.సోమవారం బీచ్ రోడ్డులోని సాయిప్రియ రిసార్ట్స్‌లో సామాజిక సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును శివ ప్రకాష్ కు అందజేశారు. పురాతన వస్తుసేకరణకర్త, విశ్రాంత సహకార బ్యాంకు ఉద్యోగి, శివప్రకాష్‌కు అవార్డు ఇవ్వడం తమకు ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. విజయనగరం కేంద్రంగా సామాజిక సేవా సంస్థ డైరెక్టరు, కమిటీ సభ్యులు శివప్రకాష్ సేవలను గుర్తించి పూరి జగన్నాధస్వామి దైతపతి భవిణ్‌దాస్ మహరాజావారి చేతులమీదుగా అవార్డును అందచేసారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ అన్నపూర్ణ శతవతి, కవి,రచయిత శంకరరావు, కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి ఆచార్య ఎస్. రామకృష్ణారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్స్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మెడికల్ రిప్రజెంటేటివ్స్ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17న ముంబైలో నిర్వహించే ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం అఫీషియల్ కాలనీలోని కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పివి.సుధాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి డి.స్రవంత్ మాట్లాడుతూ, హైలీ స్కిల్డ్ కేటగిరిగా సేల్స్ రెప్రజెంటేటివ్‌లను గుర్తించాలని, స్కిల్డ్ కేటగిరీగా నిర్ణయించి జీతాలు ఇవ్వాలని, నిర్దిష్టమైన పని గంటలు నిర్ణయించాలని డిమాండ్‌చేశారు. భారతదేశానికే ఫార్మా సూటికల్స్ హబ్‌గా ఉన్న ముంబైలో ఈనెల 17వ తేదీన సౌత్, వెస్ట్‌లో ఉన్న మెడికల్ రెప్రజెంటేటివ్స్ అందరూ డిమాండ్ల సాధన కోసం నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లు తమ వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం కలిగే జిపిఎఫ్, జిపిఆర్ఎస్ రిపోర్టింగ్ సిస్టమ్‌ను తీసివేయాలని, సేల్స్ పరంగా మెడికల్ రిప్రజెంటేటివ్ ఒక్కరినే బాధ్యులను చేస్తూ ఉద్యోగాల నుండి తొలిగించడం ఆపాలని, నార్త్ ఈస్ట్‌లో ఉన్న మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఢిల్లీ రాజధానిలో నిరసన తెలియజేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మందుల ధరలు తగ్గించాలని, నకిలీ నాసిరకం మందులు అరికట్టాలని, నల్ల బజారులో మందులు అమ్మకాలు ఆపాలని, అనైతిక విధానాల ద్వారా ప్రమోషన్లు ఆపాలని, మహిళలకు ఆరు మాసాలు మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని, మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు ప్రొడక్ట్స్ పూర్తిగా డాక్టర్లకు వివరించటానికి ప్రభుత్వం హాస్పిటల్‌లో అనుమతించాలని, దేశ ఫార్మసిటికల్ రంగాన్ని కాపాడాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.సంజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు సన్యాసిరావు, శ్రీనివాస్, కోశాధికారి రామారావు పాల్గొన్నారు.